


# సమాంతర మనుషులు

## ప్రతీ చర్యకూ ప్రతిచర్య వుంటుందని చెప్పే కథ

చెన్నూరి రాంబాబు

ఒక మనిషి మంచివాడుగా ఉండటం గొప్పా, కచ్చితంగా ఉండటం గొప్పా...చాలాకాలం నుంచి నన్ను వేధిస్తున్న సమస్య ఇది. చిత్రంగా నా మిత్ర బృందం ఇంకా ఆఫీస్‌లో చాలామంది కచ్చితంగా ఉండటమే గొప్ప అన్నదానికి వోటు వేస్తున్నారనుకోండి..కానీ నాకు మాత్రం ఈ ప్రశ్నకు కచ్చితమైన సమాధానం లేదు.

అన్ని ఆఫీసుల్లాగానే మా ఆఫీస్‌లో కూడా పనిచేసే వాళ్లున్నారు..ఎగ్గొట్టే వాళ్లున్నారు. మాయ మాటలు చెప్పి తప్పించుకునే వాళ్లు ఉన్నారు. అందులో ప్రభుత్వ కార్యాలయం కాబట్టి ఇలా అన్ని రకాల మనస్తత్వాలకు స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్లాంటి స్వాతంత్ర్యం వుంది. కాబట్టి ఈ తేడాలన్నీ చాలా స్పష్టంగా కనిపిస్తూ వుంటాయి.

మా మిత్ర బృందంలో మాత్రం వీళ్లందరికి భిన్నంగా ప్రవర్తించే వాళ్లున్నారు. ముక్కుసూటిగా పోయే ప్రసాద్...ఎవరికైనా చేసిన సహాయాన్ని వీలైనంత వరకు అజ్ఞాతంగా వుంచే వెంకట్రావు. అందుకే ప్రసాద్ అంటే ఒక గౌరవం...వెంకట్రావు అంటే చులకన చాలా మందికి. ప్రసాద్ ఠంచన్‌గా ఆఫీస్‌కు వస్తాడు. మడత నలగని డ్రస్సు, మెరిసే బూట్లు, చేతిలో బ్రీఫ్..గలగలా మాట్లాడతాడు. అనుకున్న పని అనుకున్న సమయానికి అయ్యేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాడు. ఎక్కడయినా తేడా వస్తే మాత్రం చికాకు పడుతూ ఉంటాడు.

అందంగా నవ్వే ఆ నవ్వే, తేడా వస్తే దులిపి పారేస్తుంది. తను ఎంత కచ్చితంగా ఉంటాడో, అవతలవాళ్లు కూడా అంతే కచ్చితంగా ఉండాలనుకుంటాడు.

దీనికి పూర్తి కాంట్రాస్ట్ వెంకట్రావు. ఎప్పుడూ మాసిన గడ్డం, నలిగిన బట్టలు..ఆఫీసుకు టైంకు వచ్చిన సందర్భాలు తక్కువే. అతనికి పనిచెప్పాలంటే చాలా మందికి భయం. ఆశ్చర్యంగా వుంటుంది. మనిషి డ్రస్సు, మాట వ్యక్తుల్ని ఇంతగా ప్రభావితం చేస్తాయా అనిపిస్తుంది.

పాపం వెంకట్రావంటే అందరికీ లోకువే. కానీ చాలా కొద్దిమందికి తెలుసు వెంకట్రావు చేసే అజ్ఞాత సహాయాల గురించి.

ఇంతకీ వెంకట్రావు గురించి నాకు ఎక్కువ తెలుసు కాబట్టి వెంకట్రావుని ఎవరైనా ఏమన్నా అంటే నాకు చివుక్కుమనేది. అదే మాట అప్పుడప్పుడూ అనేవాణ్ణి. వెంటనే అందరూ నామీద పడిపోతూండేవారు. నిజం చెప్పాలంటే వెంకట్రావు అందరికీ మూర్ఖుడిలా కనిపించేవాడు.

"సార్ పెద్దయ్య పిలుస్తుండు"

నా ఆలోచనలకు ఆనకట్ట వేస్తూ ప్యూన్ యాదయ్య అన్న మాటలకు తేరుకుని బాస్ రూం వైపు అడుగులేశాను.

అప్పటికే మా బ్రాంచ్ మేనేజర్ రూం కోలాహలంగా ఉంది. మా మేనేజర్ చిరునవ్వు చిందిస్తూ కనిపించాడు.

"ఫ్రెండ్స్" గొంతు సవరించుకుని మొదలుపెట్టాడు మా మేనేజర్. "ఈరోజు మనం సెలబ్రేట్ చేసుకోవాల్సిన రోజు..మన బ్రాంచ్ సక్సెస్‌ఫుల్‌గా టార్గెట్లను కంప్లీట్ చేసింది. హెడ్డాఫీస్ మన బ్రాంచిని కంగ్రాట్యులేట్ చేస్తూ పంపించిన మెసేజ్ నిన్ననే వచ్చింది. అందుకనే మిమ్మల్నందరినీ పిలిచి నా ఆనందాన్ని షేర్ చేసుకోవాలనుకుంటున్నాను. అయితే ఈ క్రెడిట్ ఎక్కువగా ప్రసాద్‌కు చెందుతుంది. ఎందుకంటే అతనే మన టార్గెట్ పూర్తవటానికి ప్రధాన కారకుడు. ఐ కంగ్రాట్యులేట్ హిమ్" ఎవరో అందించిన బొకేని, స్వీట్‌బాక్స్‌ని అందరి సమక్షంలో, ప్రసాద్‌కి అందచేశాడు మేనేజర్.

"ఎవరయినా సరే, పని కచ్చితంగా చేయాలి. క్రమశిక్షణతో చేయాలి. సమయపాలన పాటిస్తే ఎలాంటి టార్గెట్లయినా ఇట్టే కంప్లీట్ చేయవచ్చు" హుషారుగా తనకు జరిగిన సత్కారానికి మురిసిపోయి మాతో ముచ్చటించాడు ప్రసాద్.

"బాస్ ఒక్క క్షణం" వెనక నుంచి వినిపించిన ఫ్రేజర్ మాటలకు ఆగి పక్కకు వచ్చాను. అందరూ ప్రసాద్‌ని అభినందిస్తూవుంటే మేమిద్దరం మా ఫేవరేట్ టీ స్పాట్‌కు చేరుకున్నాం.

"ఇప్పుడు చెప్పు" వేడి చాయ్ వూదుతూ అడిగాను.

"మేనేజర్ అంత కటింగ్ ఇస్తూ ప్రసాద్ గురించి చెప్పాడా! మీకెవరికీ తెలియని విషయం ఒకటుంది. మనం చెక్‌లు డిస్‌బర్స్ చేసేటప్పుడు కొంతమంది వూళ్ళనుంచి వచ్చి తీసుకుంటారుగా..ఒకరోజు పాపం ఒక ముసలాయన సరిగ్గా లంచ్ టైంకు వచ్చారు. ఇక మన ప్రసాద్ అప్పుడు చిందులు తొక్కాడు చూడూ...మేమందరం స్టన్ అయిపోయి చూస్తున్నాం"

"అదేమిటి, కాస్త ఆ చెక్కేదో ఇచ్చేసి లంచ్‌కు వెళ్లొచ్చుకదా!"

"కదా! అది మనమందరం చేసే పని. కానీ సమయపాలన స్ట్రిక్ట్‌గా పాటించే ప్రసాద్ మాత్రం ఆయన్ని వెళ్లగొట్టాడు. మీరు లేటుగా వచ్చారు కాబట్టి పోస్ట్‌లో వస్తుందని చెప్పేశాడు"

"అరెరె.." బాధపడుతూ అన్నాను.

"ఉండు కథ ఇక్కడితో అయిపోలేదు. ఇదంతా వెంకట్రావు గమనించి ముసలాయన్ని పక్కకు తీసుకెళ్లి ఆయనకు డబ్బు చాలా అవసరమన్న విషయం తెలుసుకుని అకౌంట్స్ సెక్షన్‌కు వెళ్లి అక్కడ్నించి ఆ పెద్దాయన్ని బ్యాంకుకు తీసుకువెళ్లి క్యాష్ కూడా ఇప్పించాడు"

"ఇవన్నీ నీకెలా తెలుసు" అనుమానంగా అడిగాను.

"వెంకట్రావు సెక్షనులో రెండు గంటలు మాయమయ్యాడని మేనేజర్ చిందులేస్తే, ఆ సాయంత్రం వెంకట్రావుని వెతికి పట్టుకుంటే మొహమాటపడుతూ చెప్పాడు జరిగింది"

"ఎందుకలా వెంకట్రావు తనకు సంబంధం లేని విషయాల్లో తలదూరుస్తూ వుంటాడు. వేపకాయంత వెర్రివుంది అనుకునేవాణ్ణి. అదిప్పుడు గుమ్మడికాయ సైజుకు పెరిగిందని అర్థమయింది" ఆవేశంగా అంటున్న నన్ను చూసి నవ్వాడు ఫ్రేజర్.

"చూడు బాస్..ఒక్కొక్కళ్లకు ఒక్కొక్కదాంట్లో తృప్తి వుంటుంది. ప్రసాద్‌కు ఆఫీస్ పని కచ్చితంగా చేయటంలో వుంటే, వెంకట్రావుకు తనకు సంబంధించనివి నెత్తినేసుకోవటంలో వుంటుంది. మనమేం చేస్తాం" భుజాలెగరేస్తూ అన్నాడు.

అయితే వెంకట్రావు తన మనస్సాక్షి ప్రకారం నడుచుకుంటాడేమో నాకు తెలియదుగానీ, ఇది జరిగిన కొద్దిరోజులకే దాని పర్యవసానం మేం చూశాం.

ooo

"ఇదిగో కొత్తబంగారులోకం...సినిమాకి మీడియా వాళ్ల పాసులలో ఓ పది మనకోసం పట్టుకొచ్చాను" మా మిత్రబృందానికి అనౌన్స్ చేశాడు ఫ్రేజర్ క్యాంటీన్‌లో.

"సాయంత్రం 6 గంటలకు దేవి 70 యం.యం.కు వచ్చేయండి అందరూ" అంటూ హడావిడిగా వెళ్లిపోయాడు.

అందరం త్వరత్వరగా టేబుల్స్ సర్దేసి ఐదున్నరకే దేవీకి చేరుకున్నాం. యూత్ సినిమా యేమో హాలు కిట కిటలాడుతోంది. మా ఫ్రేజర్ చేతిలో టికెట్స్ చూసి ఎక్స్‌ట్రా వుంటే ఇమ్మని కొంతమంది వెంటపడ్డారు కూడా.

రామారావు, అలీ తప్పిస్తే అందరూ వచ్చేశారు. హడావిడిగా టికెట్లు తీసుకుని వెళ్లిపోయారు. సినిమా మొదలవ్వబోతోంది. నేను, వెంకట్రావు, ప్రసాద్, ఫ్రేజర్ మిగిలాం.

మమ్మల్ని బాగా గమనించిన ఇద్దరు కుర్రవాళ్లు మాత్రం మమ్మల్ని వదల్లేదు. "అంకుల్ ఎక్స్‌ట్రా వుంటే ఇవ్వండి..ఫ్రీగా కాదు. డబ్బులకే" అంటూ మా వెంట తిరుగుతూనే వున్నారు.

"ఏం చేద్దాం..రామారావు ఇప్పుడే ఫోన్ చేశాడు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయా రాలేనని" ఫ్రేజర్ సందిగ్ధంగా అడిగాడు.

"అయినా కొంటానికి రెడీగా వున్నారు జనం దీనికి పెద్ద ఆలోచించాలా" అన్నట్టుగా అన్నాడు ప్రసాద్.

తనకు సంబంధం లేకపోయినా, సంబంధం వున్నట్టుగా దూరిపోయాడు వెంకట్రావు.

"ఫ్రేజర్ ఆ రెండు టిక్కెట్లు ఇలా ఇవ్వు" అంటూ దాదాపుగా ఫ్రేజర్ చేతిలోంచి ఆ టికెట్లు లాగేసుకున్నాడు.


అప్పటివరకు మా వెంటపడుతున్న ఆ పిల్లలిద్దర్ని ఆపి ఇచ్చేశాడు. ఇచ్చినవాడు వూరుకున్నాడా! ఆ పిల్లలు డబ్బులివ్వబోతుంటే "మాకు ఇవి కాంప్లిమెంటరీగా వచ్చాయి. మాతోబాటు మీరు కూడా ఎంజాయ్ చేయండి. మనం వెళ్దాం పదండి" అంటూ మాకు మరొక మాటకు అవకాశం లేకుండా చేశాడు.

మేం ఊరుకున్నా ప్రసాద్ ఊరుకోలేదు.

"ఏమిటి వెంకట్రావ్ నువ్వు చేసిన పని..హాయిగా ఇంటర్వెల్‌లో స్నాక్స్ ఖర్చులొచ్చేసేవి. అనవసరంగా నువ్వు అడ్డుపడ్డావు. కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించడం నేర్చుకో. నీకు తెలీదు. తెలిసినవాళ్లని చూసి నేర్చుకోవు" ఇలా క్లాస్ పీకే ప్రయత్నం చేశాడు వెంకట్రావుకి.

కానీ వెంకట్రావు వైపుఎంతో కృతజ్ఞతగా చూసిన ఆ పిల్లలిద్దరి చూపుల్ని మాత్రం నేను మర్చిపోలేకపోయాను.

ఆ తర్వాత రోజున ప్రసాద్ అందరికి "వెంకట్రావు ఘనకార్యం వినండి" అని హోరెత్తి ఘోషించినా వెంకట్రావు చలించలేదు



సరికదా..నవ్వి వూరుకున్నాడు. నేనూ, ఫ్రేజర్ వచ్చేస్తుం టేమాత్రం మాతో ఒక మాటన్నాడు. "చిన్నప్పుడు చదువుకున్న న్యూటన్ చలన సూత్రాలు గుర్తున్నాయిగా..అందులో మూడవ సూత్రం ప్రతి చర్యకు ఒక సమాన ప్రతిచర్య వుంటుంది. అంతే నేను చెప్పగలిగేది"

ఒక్కక్షణం వెంకట్రావు మాటలు మాకు అర్థం కాలేదు. ఇద్దరం మొహాలు చూసుకున్నాం.

ooo

ఆ తర్వాత ఒక రోజున నేనూ, ఫ్రేజర్ క్యాంటీన్‌లో వుంటే ప్రసాద్ హడావిడిగా మా దగ్గరికి వచ్చాడు.

"పాస్‌పోర్ట్ ఆఫీసులో అర్జంట్ పనిబడింది. అక్కడ నాకు ఎవరూ తెలీదు. కాస్త తోడురండి బాస్" ప్రసాద్ కంగారు చూసి మాకిష్టం లేకపోయినా బయల్దేరాం మేం.

అక్కడికి వెళ్లేకానీ మాకర్థం కాలేదు అదొక దుర్భేద్యమయిన కోటని. పాస్‌పోర్ట్ ఆఫీసర్‌ని కలవటం అంత సులభం కాదని.

ప్రసాద్ అన్నకొడుకు పాస్‌పోర్ట్‌కి క్వెరీ వేసి పక్కన పడేశారు. దాని గురించి చెప్పుకోవాలంటే పాస్‌పోర్ట్ ఆఫీసర్‌ని కలవటం తప్పనిసరి. కానీ అక్కడున్న పరిస్థితుల్లో అది జరిగేట్టు కనబడడం లేదు. మాలాగా ఇక్కడ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దయకోసం ఎదురుచూపులు చూస్తున్న వలస పక్షులు చాలానే వున్నాయి.


ఎప్పుడూ ఆత్మవిశ్వాసం తొణికిసలాడే ఆ మొహంలో ఒక దైన్యం, దిగులు, నిరాశ అన్నీ కనిపించాయి నాకు. ధాటిగా లెక్చర్లు దంచే ప్రసాదేనా ఇంత డీలా పడిపోయాడు అనిపించింది.

అప్పటివరకు మమ్మల్నందరిని నెట్టేస్తున్న ఒక వ్యక్తి, మేం చూస్తుండగానే ఒక కుర్రాడికి సలాం చేసి లోపలికి పంపిస్తున్నాడు. కానీ ఆ కుర్రాడు లోపలికి వెళ్లిపోలేదు.

"హాయ్ అంకుల్" అంటూ మా వైపు వచ్చాడు. మనల్ని అంకుల్ అంటున్నాడు ఏమిటా అని మేము ఆలోచనలో పడినా, మాలో ముందర తేరుకున్నవాడు ఫ్రేజర్.


"హాయ్" అంటూ తిరిగి పలకరించి ఎక్కడ చూశామా ఈ కుర్రాడ్ని అంటూ ఆలోచనలోపడ్డాడు తను కూడా!

"నేనంకుల్ నన్ను గుర్తుపట్టలేదా! ఆ రోజు నాకు, నా ఫ్రెండుకు మీరు మూవీ టిక్కెట్లిచ్చారు ఫ్రీగా. మేము ఇస్తామన్నా డబ్బులు తీసుకోలేదు మీరు. మీరు మమ్మల్ని మర్చిపోయినా మేం మాత్రం మిమ్మల్ని మర్చిపోం అంకుల్. మా ఫ్రెండ్సందరికీ మీ గురించి చెప్పాం కూడా. మళ్లీ మిమ్మల్ని కలుసుకోవటం సో హేపీ నేను" ఆ కుర్రాడు చాలా సంబరంగా అన్నాడు.




"అయినా మీరేమిటి అంకుల్ ఇక్కడ...ఎవర్నయినా కలవటానికి వచ్చారా?" సందేహంగా అడిగాడు.

"అవును బాబూ...మాకు పాస్‌పోర్టు ఆఫీసర్‌గారిని అర్జంటుగా కలిసే పనుంది. ఇక్కడ చూస్తే ఆయన్ని కలిసే అవకాశం లేదు. కలవాలంటే ఎలాగో కూడా తెలియటం లేదు" అప్పటివరకు మౌనంగా ఉన్న ప్రసాద్ మాటల్లో ఎక్కడో ఏదో ఆశ.



"నో ప్రాబ్లెమ్ అంకుల్. ఆయన మా డాడీయే. నేను తీసుకెళతాను. నాతో రండి" అంటూనే ముందుకు కదిలాడు ఆ కుర్రాడు మమ్మల్ని కూడా రమ్మంటూ.

కలా, వైష్ణవమాయా అని సరదాగా చదువుతూ వుంటాం. వింటూ వుంటాం. ఇది కల కాని నిజంగా మా ముందు సాక్షాత్కరించింది ఆ క్షణాన.

"బాస్ ఆ రోజు వెంకట్రావేమన్నాడు. న్యూటన్ 3వ సూత్రంలా ప్రతి చర్యకూ, ప్రతి చర్య వుంటుందన్నాడు గుర్తుందా..అప్పుడు మనకు అర్థం కాలేదు. మనం ఒకళ్లకి మంచి చేస్తే ఎప్పుడో మనకి అవసరమయినప్పుడు ఇంకొకళ్లు మంచి చేస్తారనా..నాకయితే అదే అనిపిస్తోంది" చెవిలో నెమ్మదిగా అన్నాడు ఫ్రేజర్. ప్రసాద్ మాత్రం మమ్మల్ని చూసే ధైర్యం లేక తలొంచుకున్నాడు, ఆ క్షణాన.

o

## తమన్నా క్లాసులు

తమన్నా గ్లామరస్‌గా వుంటుందని కొత్తగా చెప్పేదేం లేదు కదా. తన గ్లామర్ రహస్యాన్ని చెప్పడం మాట అలా వుంచి, తన సహచర నటీమణులకు అందానికి సంబంధించిన క్లాసులు మాత్రం తెగ పీకుతోందిట ఈమధ్య. ముఖం కళకళలాడుతూ ఫ్రెష్‌గా కనిపించాలంటే విటమిన్ సి, ఇ వున్నవి ఎక్కువగా తినాలని సలహాలిస్తోందిట. ఇలా క్లాసులు పీకి విసిగించడం ఏంట్రా బాబూ అని తలలు పట్టుకుంటున్నారట దీన్ని భరించలేని వాళ్లు.